# భేషైన పని

''విన్నావుట్రా...?''

"ఆఁ"

"ఏమిటి?''

"అదే"

"ఏదిరా?"

"అదేరా ఇప్పుడు నువ్వన్నమాటే"

''అది కాదురా''

''మరేదిరా?"

''వాడి సంగతేరా"

"ఎవడి సంగతీ?''

''ఇప్పుడిటు వెళ్ళలా"

''ఎవరూ అప్పారావా?"

ఆఁ వాడే, చూశావ్"

''ఆఁ''

"ఏం చూశావ్?"

"వాణ్ణే"

"ఏముందిరా వాడిలో, వాడి మొహం"

''లేకేం! వాడి మొహం యీ మధ్య కాస్త కళ కళ్ళాడుతున్న ట్టుంటేను''

"అవున్లే. అంతేనా నువ్వు చూసింది"

"మరేం చూడాలంటావ్"

"వాడెక్కిన స్కూటర్ చూళ్లేదురా"

"ఆఁ చూడకేం"

"కొత్తది గదురా అదీ?"

"ఏమోగాని మొత్తంమీద కొత్తదిగానే ఉందిలే"

"మొన్నే కొన్నాడు తెల్సా"

"అలాగా"

"అవును అదెలా కొన్నాడంటావ్"

"ఏముంది డబ్బెట్టి కొనుంటాడు"

"డబ్బెలా వచ్చిందనుకున్నావ్"

"బహుశా ఎక్కడా కన్నం వేసివుండడు"

అంతటివాడు కాదంటావా?"

"ఏం?"

"మన అయిదోక్లాసు రోజులు గుర్తు లేవురా?"

"లేకేం?"

"అప్పుడోసారి వీడేం చేశాడు?"

"ఊఁ...ఏం చేశాడూ?"

"నీ పెన్సిలు ఎత్తుకుపోయి గోలీల కమ్ముకోలా!"

"అయితే?"

"ఆ బుద్ధులు ఎక్కడికి పోతయ్యంటావ్"

"ఊఁ ఎక్కడికి పోతయ్యంటావ్?"

"ఎక్కడికీ పోలేదు"

"మరి?"

''అప్పుడు దొంగతనాలు చేశాడా''

"ఊఁ''

"ఇప్పుడు దొంగవేషాలు వేస్తున్నాడు ?''

''ఆఁ?"

"ఎంత బాగా వేస్తాడనుకున్నావ్ ?''

"చాలా బాగా అనుకుంటా''

"నీకెలా తెల్సు ?''

''మన స్కూలు డ్రామాల్లో చిన్నప్పుడేదో ప్రైజు కొట్టాడు గదరా''

"అది అప్పటి మాట"

"ఇప్పటి మాటేమిటంటావ్"

''మన చంద్రబాబ్‌గాడు లేడూ''

''లేకేం. ఇంకా బ్రతికే ఉన్నాడుగా"

"ఆఁ వాడే. వాడికో మామయ్యున్నాడా లేదా''

''ఉండే ఉంటాడు''

"నీకెలా తెల్సు''

"దానిదేముందిరా పెళ్ళి వయసు వాడికి చాలామంది మామయ్యలు పుట్టుకొస్తారు''

"ఈయనలాంటి మామయ్య కాదులే"

"మరి?''

''అసలు మామయ్యే"

"అలాగా"

''మామయ్యంటే మామయ్యా. ఆయనో ఎమ్మెల్యే''

''ఓహో''

"ఈ అప్పారావుగాడు ఆ చంద్రావుని పట్టుకొని..."

"ఊఁ పట్టుకొని"

"ఆ ఎమ్మెల్యే మామయ్యని మంచి చేసుకున్నాడు"

"చేసుకొని ?"

"ఆయన్నూ, ఆయన పార్టీని పొగట్టం మొదలెట్టాడు.

"తర్వాత ?"

"ఇతర్లను తిట్టడం మొదలెట్టాడు"

"ఊఁ ఆ తర్వాత"

"రోజూ ఆయన యింటికెళ్ళి కబుర్లు కొట్టడం సాగించాడు"

"అలాగా. వాడు కబుర్లలో అఖండుడేగా"

"ఆగవోయ్. వాడంతటితో ఆగాడా. తరవాత్తరవాత రికమం డేషన్లు కొట్టుకొచ్చాడు."

"ఎక్కణ్ణించి ?"

"అక్కణ్ణుంచే, ఆ చంద్రావ్‌గాడి మామయ్య దగ్గర్నుంచే"

"అలాగా. కొట్టుకొచ్చి ఏంజేశాడంటావ్"

"వాటిని చంకనేసుకెళ్ళి ఓ మంచి ఉద్యోగాన్ని కొట్టేశాడు"

"నిజంగానా ?"

"ఏడ్చినట్టుంది, కనపట్టంలా"

"ఏమిటి"

"అదే ! ఇందాక వాడెక్కిన స్కూటరు"

"కనపడకేం. అదేం దేవతా సైకిలు కాదుగా"

"మరింకా నసుగుతావేం. మొదటి నాలుగునెల్ల జీతంతో కొన్నాడది"

"అంత పెద్ద ఉద్యోగమా ?"

''మరేమనుకున్నావ్ పాతికమందిని కాదని వీడికిచ్చారది.''

''గట్టివాడేనన్నమాట''

''వాడి పిండాకూడేంకాదూ. ఇంతేనా నువ్వర్థం జేసుకున్నది''

''ఇంకేముంది ?''

''ఇంకేమీ లేదు. అంతా ఇందులోనే ఉంది''

''ఏమిటది ?''

''నీ కింకా అర్థంగాలేదా ? వాడొట్టి స్వార్థపరుడూ, అసాంఘిక శక్తుడూను''

''ఎలాగంటావ్ ?''

''రికమండేషన్లతో ఉద్యోగం సంపాదించటం తప్పుకాదురా ?''

''అవునవును.''

''అది దుష్టసాంప్రదాయం కాదూ ?''

''కాబోల్ను''

''వీడిమూలంగా పాతికమందికి అన్యాయం జరగలా ?''

''ఎలాగూ ?''

''వాళ్ళకు డిగ్రీలున్నాయిగాని, రికమండేషన్లులేవుగా ?''

''అయితే ?''

''అందుకని వాళ్ళనుకాదని వీడికిచ్చారది.''

''అన్యాయమెందుకనుకోవాలి ?''

''మరేమనుకోవాలి ?''

''రికమండేషన్లు లేకపోవటం వాళ్ళ ఖర్మగావచ్చు.''

''అనుకుందాం. కాని పాతికమంది కర్మలు ఒక్కలా ఎలా రాసి పెట్టి ఉంటాయంటావ్ ?''

''ఏమో ! ఆ పాతికమంది ఒకే ముహూర్తంలో పుట్టి ఉండ కూడదా !''

''ఏమైనా వీళ్ళంతా సంఘానికి చీడపురుగులు.''

''ఎవళ్ళంతా ?''

''ఈ అప్పారావులూ, చంద్రావులూ, వాడి మామయ్యలూను.''

''ఎలాగంటావ్ ?''

''వీళ్ళమూలంగా సమర్థులైనవాళ్ళకి దొరక్కుండా చచ్చు వెధవ లకు పోవటం లేదుట్రా ఉద్యోగాలు ?

''పోనిద్దూ వెధవగొడవ.''

''అంత నిర్లక్ష్యమైతే ఎలాగురా ! సామాజిక విలువలంటూ ఏమన్నా తగలడాలా లేదా.''

''తగలడుతూనే ఉన్నాయిగా.''

''మరి ఆర్పవద్దుట్రా.''

''ఆర్పుతూనే ఉన్నారుగా.''

''ఎవర్రా ?''

''అదే ! రికమండేషన్లు తెచ్చుకోని ఆ పాతికమందీని.''

''ని ఉద్దేశ్యమేమిటంటావ్'' ?''

''ఎదో వాడి పొట్టపాట్లు వాడు పడుతూంటే మన కెందుకురా కోపం.''

''వద్దంటావ్ ?''

''ఎంతైనా మన స్నేహితుడే గదరా. అయినా వాడికేం లోపం డిగ్రీ గట్రా ఉన్నాయిగా.''

''అయితే నాకేనా లేంది ?''

''అలాగని ఎవరన్నారు ?''

"మనం అయిదోక్లాసు చదివేప్పుడు నాకు మూడు మార్కులొస్తే, అప్పారావుకు వొచ్చింది రెండు మార్కులే గదరా."

"అవునవును."

"మరి వాడు నాకన్నా ఎలా ఎక్కువంటావ్ ?"

"నే ననలేదే"

"అయితే నాకు రాకుండా వాడికెందుకు పోవాలా ఉద్యోగం ?"

"ఏమిటేమిటీ ? నువ్వుకూడా అప్లికేషను పెట్టావా. ఆ ఉద్యోగానికి ?"

"మరేమనుకున్నావ్ ?"

"నువ్విప్పుడు చేస్తున్న ఉద్యోగానికేం రోగం వచ్చిందిరా ?"

"వెధవ్వుద్యోగం. బొచ్చెడు జీతమన్నారాదు. దాన్నెలా నమ్ముకుర్చోమన్నావు."

"అందుకని మానేశావన్నమాట."

"ఎబ్బే, మానందే."

"అయితే అదుండగానే దీనిక్కూడా అప్లయి చేశావన్నమాట."

"అదీ ! అలా దారికి రా"

"పోసిద్దూ. అది అప్పారావుకు పోతేపోయింది. వాడినన్నా కాస్త సుఖంగా ఉండనీ. నీకిది ఉందిగా."

"ఏం ఉద్యోం లెద్దూ. బొచ్చెడు జీతమన్నారాదు."

"నీకంత కోరిగ్గా వుంటే నాకింతవరకూ ఎందుకు చెప్పలేదు ?"

"నువ్వేం ఆర్చేవాడివా, తీర్చేవాడివా ?"

"వినరా నాయనా. మా ఆఫీసులో ఓ పోస్టు కాళీ అయ్యింది."

"అయితే ?"

"జీతం అప్పారావుకొచ్చినంతా వస్తుంది."

"వస్తే?"

"నీకంత కోరిగ్గాఉంటే ఎందుకు అప్లయిచేయకూడదు."

"అంత పెద్ద ఉద్యోగం వస్తుందా అని?"

"అప్పారావుకెలా వచ్చిందంటావ్?"

"వాడికి రికమండేషన్లున్నాయి."

"నువ్వూ సంపాదించు."

"ఛా... ఛా...!"

"ఏం...?"

"అంత అప్రాచ్యపుపని నే చెయ్యను."

"నువ్వొక్కడో ఉత్త వెర్రిబాగులవాడిలా ఉన్నావ్."

"కాటోల్ను."

"కాటోన్లేల్నేమిటీ నీ తలకాయ, ఈ రోజుల్లో చప్రాసీ ఉద్యోగానికూడా సవాలక్ష రికమండేషన్లు కావాల్రా నాయనా."

"కావాలంటావ్."

"ఓరి పిచ్చినాయనా, అవిలేందే నీ మొహం చూసి ఇచ్చేదెవడు?"

"రికమండేన్లంటే నాకంతతా కోపం లేదనుకో. కాని..."

"ఊఁ కానీ..."

"నన్నెరిగిన వాళ్లెవరూ లేరే."

"అలాగనుకుంటే ఎలా. వెళ్ళి ఎవణ్నైనా పట్టు."

"ఎవణ్ణి పట్టాలంటావ్?"

"పట్టవలసినవాణ్ణే పట్టాలి. ఆ సుబ్రావ్ మామయ్య లేడూ..."

"ఊఁ..."

"ఆయనకీ మా ఆఫీసరుకూ స్నేహం లావు. ఆయన్నే పట్టు."

"ఇస్తాడంటావా?"

"అంతా నీలో వుంది. ముందా చక్రాన్ని మంచి చేసుకొని తోము."

"తోముతాననకో. కాని నాకు సందేహంగానే వుంది. ఇంతకాలం ఎంత తోమినా దొరకనివి ఇప్పుడు దొరుకుతాయా ? అని."

"అచ్ఛా... దిగిచూడు తెలుస్తుంది."

"అంతేనంటావా ?"

"ఓ భేషుగ్గా"

★